క్లుప్తంగా

విద్యార్థులకు డైరీల పంపిణీ



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధులు సామల వీరేశం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి శుక్రవారం స్టూడెంట్ డైరీలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రోజువారిగా ఇచ్చే హోం వర్క్‌ను స్టూడెంట్ డైరీలో రాసి పంపిన ట్లయితే తల్లిదండ్రులు పరీక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు శేఖర్ బాబు, సుజాత, ఉమాదేవి, రేణుక, లక్ష్మీ బాయి, కుమారస్వామి, కృష్ణవేణితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత



ఐనవోలు : మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాజీ సర్పంచ్ గోకె రేణుక శ్రీనివాస్ 20 మంది క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ తాళ్లపల్లి రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



శాయంపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, సిద్ధార్థ, హరి, రాజ్‌కుమార్, మానస, సందీప్, అనూష, ప్రవళిక, గణేశ్ పాల్గొన్నారు.

అక్కంపేటలో వైద్యశిబిరం



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్సింహరావు, సంపత్, సరిత, వసంత, మరియ, మాధవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : పంథిని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంథిని, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, చింతకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, కేయూసీ, యాదవనగర్, మడికొండ, టేకులగూడెం, వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు, కలెక్టరేట్ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు. ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు. శంభునిపేట, దేశాయిపేట, ఉర్సు, పోతన, ఆజంజాహి మిల్స్, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్ ప్రాంతాలతో పాటు తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

పంచాయతీలను పట్టించుకోవాలి

- నిధులు లేక కార్యదర్శుల ఇబ్బందులు
- వేతనాలు ఖర్చు చేస్తూ నెట్టుకొస్తున్నామంటూ మొర..!
- నిధులు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



కమలాపూర్ : ఎంపీఓ రవికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కమలాపూర్ : ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం మండల పంచాయతీ అధికారి సీహెచ్.రవికి వినతిపత్రం అందించారు. అనంతరం కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిధుల కొరత తీవ్రంగా ఉందని, రోజువారి కార్యకలాపాల నిర్వహన కోసం తమ వేతనాల నుంచి డబ్బులు ఖర్చు చేస్తూ మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఖర్చు చేసిన డబ్బులకు ఐఎఫ్‌ఎంఎస్ ద్వారా పేమెంట్ చేసిన చెక్కులు సుమారు 10 నెలలుగా క్లియర్ కాలేదని, దీంతో ఏ ఒక్కరు కూడా గ్రామపంచాయతీలకు క్రెడిట్ ద్వారా సామాగ్రి ఇవ్వడం లేదని వాపోయారు. పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ డీజిల్‌కు కూడా నిధులు లేవని, స్వంతగా ఖర్చు చేస్తున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శులు రమణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, వినీల్‌రెడ్డి, కుమారస్వామి, చైతన్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం భీమదేవరపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ వీరేశంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఉన్నందున రోజువారి కార్యకలాపాలకు పంచాయితీ కార్యదర్శుల వేతనాల నుంచి ఖర్చు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొటున్నారని తెలిపారు. త్వరలో బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాట్లు చేయాల్సి ఉండగా కార్యదర్శులకు మోయలేని ఆర్థిక భారం పడనుందని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఇప్పటికీ ఐఎఫ్ఎంఎస్ ద్వారా పేమెంట్ చేసిన చెక్కులు సుమారు 10నెలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

ఐనవోలు: టీపీఎస్‌సీఎఫ్ సంఘం పిలుపు మేరకు పంచాయతీ కార్యదర్శులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఎంపీఓ రఘుపతిరెడ్డికి శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఉందని తెలిపారు. రోజువారి కార్యక్రమాలైన పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు తదితర పనులకు స్వంతంగా ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీడీఓ, ఎంపీఓ చొరవ తీసుకోవాలన్నారు.

దామెర : గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి నరేష్ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓకు శుక్రవారం వినతిపత్రం అందించారు. గ్రామపంచాయతీల్లో నిధుల కొరత కారణంగా కార్యదర్శులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శులు వేణుమాదవ్, సరళ, సిరివెన్నెల, కవిత రజిత, సందీప్, మణిదీప్, ధర్మారెడ్డి, రామ్మూర్తి, అన్నపూర్ణతో పాల్గొన్నారు.



పరకాల : వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు



ఐనవోలులో..



ఎల్కతుర్తిలో..

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది సత్యనారాయణ

ఆత్మకూరు : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని న్యాయవాది టింగిలికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సహాయక కమిటీల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది టింగిలికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. మహిళలు గ్రామ స్థాయిలో హక్కుల సాధనకు సిద్ధంగా ఉండాలన్నారు. కుటుంబం నుంచి గ్రామం వరకు ఎక్కడ కూడా అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. గ్రామాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకించి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం పనిచేసే వ్యవస్థల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ఎస్సై రమేశ్ మాట్లాడుతూ.. కుటుంబంలోని మహిళలకు పురుషులతో సమానంగా గౌరవం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, ఏపీఎం లలిత, సర్వోదయ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర, హరితతో పాటు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని రోల్‌మోడల్ చేయడమే మోదీ లక్ష్యం



మాట్లాడుతున్న నిశిధర్ రెడ్డి

శాయంపేట : 2047 వరకు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పని చేస్తున్నారని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ హితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాశతో ఉన్న ప్రతిఒక్కరూ బీజేపీలో చేరుతున్నారని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బాసాని విద్యాసాగర్ తండ్రి చేనేత సొసైటీ వైస్ చైర్మన్ బాసాని సాంబయ్య. మోరె పాణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, నాయకులు రాజు, శ్రీకాంత్, నాగరాజు, చంద్రమౌళి, రాజశేఖర్, వీరస్వామి, తిరుపతి, సుమన్, సుధాకర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా విద్యుత్ మీటర్లు బిగించుకోవాలి



జీరో బిల్లుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

శాయంపేట : ప్రతిఒక్కరూ విద్యుత్ మీటర్లు బిగించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత కరెంట్ పొందాలని ఎన్పీడీసీఎల్ ఏడీఏ దేవేందర్ నాయక్, ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శుక్రవారం ఇంటింటికి తిరిగి జీరో బిల్లులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూ.938 విద్యుత్ మీటర్ కేటాయిస్తుందని అన్నారు. విద్యుత్ మీటర్ లేని ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ మీటర్ బిగించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సంతోష్‌బాబు, ఏఎల్‌ఎం సాగర్, సిబ్బంది అరుణ్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

- మాజీ సర్పంచ్ ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

శాయంపేట : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భూపాలపల్లి నియోజకవర్గానికి, శాయంపేట మండలానికి అభివృద్ధి చేసిందేమి లేదని మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ విమర్శించారు. మండల కేంద్రంలోని శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. హనుమకొండ నుంచి శాయంపేటకు కనీసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, రమణారెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. స్థాయికి మించి విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, పరకాల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నందం, నాయకులు మోహన్, కరణ్‌బాబు, వెంకట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎంఈఓ



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ఎల్కతుర్తి : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఎంఈఓ రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి అండర్–14, 17 విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రామకృష్ణరాజు ముఖ్య అతిథిగా హాజరై కీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. అనంతనం నిర్వహించిన ఖోఖో. కబడ్డీ పోటీల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. దీంతో ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు వెంకటరమణారెడ్డి, రాములు, ధనలక్ష్మి, పౌర్ణిమ, స్వరూప, కిరణ్, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- డీఐఈఓ గోపాల్



ఫ్రెషర్స్ డేలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

పరకాల : పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని డీఐఈఓ గోపాల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా డీఐఈఓ గోపాల్, సీఐ క్రాంతికుమార్ హాజరై మాట్లాడారు. నేటి యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడవాలని సూచించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని ఛేదించే దిశగా పయనించాలని అన్నారు. అనంతరం సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేని పక్షంలో భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ చాలా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

కొనసాగుతున్న ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎల్కతుర్తి : మండలంలోని వల్బాపూర్ గ్రామంలో గల ఎస్ఆర్ఆర్ ఫార్మసి కళాశాలలో ప్రారంభమైన 4వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి గ్రామ ప్రజలకు ఔషదాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఔషదాలు వాడాలి, ఎవరి సలహా మేరకు వాడాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరీ ఆగయ్యగౌడ్, ఏఎస్సైలు ఉబేదుల్లా, కనుకయ్య, వైస్ ప్రిన్సిపాల్ కర్ణాకర్‌రెడ్డి, పరమేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ వెంటనే బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్, జిల్లా అధికార ప్రతినిధి బగ్గి రాజ్‌కుమార్, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు నాయిని సరస్వతి, జిల్లా మహిళా కార్యదర్శి ఆకుల విజయ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధ్యక్షురాలు ఇమ్మడి ప్రసన్న, నాయకులు బాబు, రాజ్‌కుమార్, రాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పోరుయాత్ర ప్రారంభం



విద్యార్థుల పోరు యాత్రలో పాల్గొన్న నాయకులు

విద్యారణ్యపురి: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను సందర్శించి అందులోని విద్యార్థుల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో హనుమకొండ జిల్లా స్వేరో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థుల పోరు యాత్రను చేపట్టారు. ఈమేరకు పోరుయాత్రను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ హనుమకొండలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనం అందడం లేదని, మౌలిక వసతులు లేవని అన్నారు. అలాంటి సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు ఈ యాత్రను ప్రారంభించామని, ఈనెల 30వరకు కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ బాధ్యులు గజవెల్లి శ్రావణ్, శివకుమార్, రవి, సిద్దు, అన్వేష్, నరేష్, సాయి, బాబు, మహేష్, తరుణ్, మనోహర్, రాకేష్ పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రం

రామన్నపేట: దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని, ప్రజల్లో చీలిక తీసుకువస్తూ మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాల శెట్టి మూర్తి విమర్శించారు. దేశాయిపేటలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో మాట్లాడారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు.

బంధం చెరువులోని చెత్త తొలగింపు

హన్మకొండ అర్బన్: వినాయక నిమజ్జంతో నగరంలోని కాజీపేట దర్గా సమీపంలోని బంధం చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను 'మెదివి సాంఘిక సేవా సంస్థ' ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించినట్లు సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువుల్లో పడేయడం ద్వారా చెరువులు కలుషితమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ప్రశాంత్ సుంకరి, ప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

మామునూరు: వరంగల్ 43వ డివిజన్ నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీవెంకటేశ్వర కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు నాగబడి శ్రీనివాస్, 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ కోరారు. ఈమేరకు కార్పొరేటర్ ఈదుల అరుణను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా అధికారులు, సిబ్బంది స్పందించి ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

చదరంగ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 22వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ –15 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. ఈమేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా చదరంగ పోటీల వాల్‌పోస్టర్లను ఏసీపీ కార్యలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పలు కాలనీల్లో సమస్యల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రజా సమస్యల పరిష్కరించాలని ప్రజలతో కలిసి బల్దియా ఎదుట కార్పొరేటర్ మరుపల్లి రవి చేపట్టిన నిరసన దీక్షకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం స్పందించారు. ఈమేరకు కార్పొరేటర్‌తో కలిసి బీరన్ననగర్, రజకవాడ, డీకే నగర్, ప్రగతి నగర్, ఎల్లమ్మ తాళ్ల మండేవా, మంకీ ఫుడ్ కోర్ట్, ఉప్పరోనికుంట, ముకుందా ఎస్టేట్‌లో అధికారులు పర్యటించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

హన్మకొండ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని బీసీ నాయకుడు పులి రజనీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని బీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కులగణన చేయాలని, జనాభాలో 60 శాతంగా ఉన్న బీసీలకు సరైన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరముందని గుర్తుచేశారు. బీసీ సంఘం నాయకులు బుద్ధ వెంకన్న, గుండెకారి రంగారావు, రుద్రారపు రాజు, మహేష్ గౌడ్, రఘు, మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

- అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగుల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగులు

పరకాల : గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ తమను పర్మనెంట్ చేయలేదని, వెంటనే పర్మనెంట్ చేయాలని మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నర్సింహకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకుడు బయ్య కృష్ణంరాజు, దుప్పటి సుమంజయ్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పర్మనెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు అందించాలని కోరారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కరాల ఖర్చులు రూ. 30వేలు ఇవ్వాలని, కార్మికులకు బీమా కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐల్లో ఉన్న అవకతవకలన్నింటిపై విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. తమ బాధలను ప్రభుత్వానికి తెలుపాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రశాంత్, భాస్కర్, కిశోర్, శ్రీనివాస్, వసంత, చంద్రమ్మ, సులోచన, నీలమ్మ, ప్రమోద్, సుమన్, తిరుమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు

- దంచికొట్టిన వర్షం



శాయంపేటలో కురుస్తున్న వర్షం

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పిడుగుపాటుతో ఇన్సులేటర్ కాలిపోవడంతో విద్యుత్ ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ సంతోష్‌బాబు, జేఎల్‌ఎం సాగర్, సిబ్బంది అరుణ్‌కుమార్ వర్షంలోనే విద్యుత్ పునరుద్ధరణ పనులు మొదలు పెట్టి విద్యుత్ సరఫరాను అందించారు. పలువురు కృతజ్ఞతలు తెలిపారు.